

చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.53,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.4,800

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.65,000
రిటైల్ వెండి గ్రాము	రూ.67

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	17
తిరుపతి	35	18
తిరుమల	31	14
గూడూరు	34	20
నగరి	36	18



గురుదక్షిణామూర్తికి విశేష పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మేధో గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ట చేసి, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు.

న్యూస్‌రీల్

7న షబేబరాత్ పండుగ

చిత్తూరు రూరల్: ముస్లింలు షబేబరాత్ పండుగను ఈనెల 7న జరుపుకోవాలని చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఖాజీ సయ్యద్ మోహమ్మద్ కమాలుల్లా జుహురి లతీఫీజునైది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లింలు తమ పూర్వీకుల ఆత్మలకు శాంతి ప్రాప్తి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని పేర్కొన్నారు.

రేషన్ పంపిణీలో వేగం పెంచండి

చిత్తూరు రూరల్: జిల్లాలో రేషన్ పంపిణీలో వేగం పెంచాలని డీఎస్ఓ శంకరన్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు 11.3 శాతం రేషన్ సరుకులు మాత్రమే పంపిణీ అయినట్లు చెప్పారు. ఈనేపథ్యంలో మండల స్థాయి అధికారులతో మాట్లాడి రేషన్ పంపిణీలో వేగం పెంచేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీ నాటికి రేషన్ పంపిణీ పూర్తి కావాలని ఆదేశించారు. ప్రతి వీధికి రేషన్ పంపిణీ వాహనం వెళ్లాలని సూచించారు. చౌక దుకాణాల్లో సరుకులు ఇవ్వకూడదని చెప్పారు. ఫిర్యాదులు అందితే చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

ఓటు హక్కు ఉన్న ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ సెలవు

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజున ఓటు హక్కు ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ సెలవు ప్రకటించారు. ఈ మేరకు ఎన్నికల సంఘం సీఈఓ ముకేష్‌కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఓటు హక్కు వినియోగించుకునే ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ సెలవును ప్రకటించాలని సూచించారు. ఈనెల 13న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)(సి) ప్రకారం 2023–24 విద్యాసంవత్సరానికి ఉచిత ప్రవేశాలను కల్పిస్తున్నారన్నారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలకు (అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులు) 5 శాతం, ఎస్సీలకు 10 శాతం,ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాలకు (బీసీ, మైనారిటీ, ఓసీ)6 శాతం ప్రైవేట్ పాఠశాలల్లో సీట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఒకట వతరగతికి 25 శాతం సీట్లు కేటాయించి 2023–24 విద్యాసంవత్సరంలో అడ్మిషన్‌లు కల్పిస్తారని తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వార్షిక ఆదాయం రూ.1,20,000, పట్టణ ప్రాంతాలలో నివసించే వారికి రూ. 1,40,000 ను ప్రాతిపదికగా తీసుకుని వారి పిల్లలను అర్హులుగా గుర్తిస్తారని వెల్లడించారు. www.cse.ap.gov. in వెబ్‌సైట్‌లో మార్చి 6 వ తేదీ నుంచి 16 వ తేదీలోపు ప్రైవేట్ యాజమాన్యాలు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఆ తర్వాత ఈనెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 7 వ తేదీ వరకు ఆసక్తి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

నాపేరు పురుషోత్తం, మాది చిత్తూరు



డిగ్రీ వరకు చదువుకున్న నాకు కమ్యూనికేషన్‌తో పాటు వేరే ఇతర డిప్లొమా కోర్సుల్లో అనుభవం లేదు. కొంత అయోమయం నెలకొంది. స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల ద్వారా శిక్షణతో పాటు ఉపాధి కూడా కల్పిస్తారని తెలుసుకున్నా. శిక్షణను పొందాను. శిక్షణ కాలం సమయంలోనే చెన్నైలోని ఒక బ్యాంకింగ్ సంస్థకు ఎంపికయ్యాను. సుమారు రూ. 2.5 లక్షల ప్యాకేజీతో నన్ను ఎంపిక చేసుకున్నారు. ఇటువంటి కోర్సులను ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

నాపేరు నళిని, నల్ల వెంకటయ్యగారిపల్లె



బీకాం చదివాను. కంప్యూటర్ కోర్సుల్లో ఉద్యోగం కావాలని కోరికుండేది. స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో చేరి సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా శిక్షణ పొందాను. ఇప్పటికే ఓ కంపెనీకి ఎంపిక అయ్యాను. ఆ కంపెనీ రూ. 2.25 లక్షలు సంవత్సరానికి జీతం ఆఫర్ చేసింది. ప్రస్తుతం ఆ ఉద్యోగంలో చేరితే మరిన్ని మెట్లు ఎక్కడానికి వీలు కలుగుతుంది. ఆనందంగా ఉంది. ఇలాంటి కోర్సులు ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం



కొలువుల కల సాకారం

నిరుద్యోగ యువకుల్లో నైపుణ్యం పెంచి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు సత్ఫలితాలను ఇస్తున్నాయి. నాడు ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలని ముఖ్యమంత్రి కాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో మార్పులకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గానికో స్కిల్ హబ్ సెంటర్, పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో స్కిల్ కాలేజీని ఏర్పాటు చేశారు. యువతకు ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 4వేల మంది శిక్షణ పొందగా..1,100 మందికి ఉద్యోగాలు లభించాయి. మరో 472 మందికి అవకాశాలు రానున్నాయి. వచ్చే విద్యా సంవత్సరంలో ఈ కోర్సుల్లో చేరేందుకు ఇప్పటికే 1,051 మంది విద్యార్థులు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

- సీఎం జగన్ చొరవతో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు ప్రోత్సాహం
- నియోజకవర్గానికో స్కిల్ హబ్ సెంటర్,
- పార్లమెంట్ పరిధిలో కళాశాల ఏర్పాటు
- ఇప్పటి వరకు 2,769 మందికి శిక్షణ
- 1500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

సాక్షి, చిత్తూరు: జిల్లాలో స్కిల్ హబ్ సెంటర్లలో శిక్షణ పొందిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. చిత్తూరు, కుప్పం, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, నగరి, గంగాధర నెల్లూరు నియోజకవర్గాల పరిధిలో స్కిల్ హబ్ సెంటర్లలో నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వివిధ రకాల కోర్సులను తీసుకొచ్చారు. ప్రతి కోర్సు కాల వ్యవధి మూడు నెలలు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు సుమారు 2,769 మంది ప్రత్యేక కోర్సుల ద్వారా శిక్షణ పొందారు. వీరిలో 1,128 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. మిగిలిన వారికి వివిధ జాబ్ మేళాల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. స్కిల్ హబ్‌లో శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు నెలకు రూ.1000 స్టైఫండ్‌గా అందజేస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత స్కిల్ ఇండియా సర్టిఫికెట్ అందజేస్తున్నారు.

ఈ కోర్సుల్లో శిక్షణ

బ్యూటీషియన్, అసిస్టెంట్ ఫ్యాషన్ డిజైనర్, ఫీల్డ్ టెక్నీషియన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, కలంకారీ, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌లో 30 మందికి శిక్షణ ఇస్తున్నారు. తిరుపతి, బెంగళూరు, చెన్నై నగరాలతోపాటు అనేక నగరాలకు సమీపంలో చిత్తూరు జిల్లా ఉంది. ఈ ప్రాంతాల్లోని కంపెనీల అవసరాలకు అనుగుణంగా కోర్సులను ప్రవేశపెట్టి శిక్షణ ఉపాధి కల్పిస్తున్నారు.





స్కిల్ హబ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

యువతకు వరం



జిల్లాలో ఇప్పటివరకు సుమారు 4వేల మంది శిక్షణ ఇచ్చాం. 1,100 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. మరో 472 మందికి త్వరలో అవకాశం రానున్నాయి. వివిధ సంస్థలు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా నైపుణ్యత సాధించిన వారిని ఎంపిక చేసుకుని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఈ కోర్సులు యువతకు వరంగా మారాయి. రానున్న కాలంలో మరింత ఎక్కువ మందికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– గుణశేఖరరెడ్డి, జిల్లా మేనేజర్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్

మరింత ఎక్కువ మందికి..



ముఖ్యమంత్రి ప్రతి వీడియో కాన్ఫరెన్స్‌లో నిరుద్యోగ యువకుల్లో నైపుణ్యం పెంచి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చెబుతున్నారు. అందుకనుగుణంగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని కళాశాలల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు ప్రవేశపెట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. పలు కార్పొరేట్ సంస్థలు ముందుకొచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో పలు బ్యాచుల్లో శిక్షణ పొందిన వారు ఉద్యోగాల్లోనూ స్థిరపడ్డారు. రానున్న రోజుల్లో మరింత ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తాం.

– ఎం.హరినారాయణన్, జిల్లా కలెక్టర్ చిత్తూరు



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం లక్షమోదక లక్ష్మీగణపతి హవనానికి సర్వం సిద్ధమైంది. మూడు రోజుల కార్యక్రమాలకు దేవస్థానం భారీ ఏర్పాట్లు చేపట్టింది. విద్యుత్ వెలుగుల్లో ఆలయం కాంతులీనుతోంది. – కాణిపాకం(యాదమరి)

బాబు, లోకేష్ కళ్లులేని కబోదులు

- జీడీ నెల్లూరులో రూ.200 కోట్లతో రోడ్ల నిర్మాణం
- నియోజకవర్గ వ్యాప్తంగా ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి సుడిగాలి పర్యటన

సాక్షి, తిరుపతి: కళ్లముందు అభివృద్ధి కనిపిస్తున్నా కనిపించనట్టు నటిస్తూ పచ్చి అబద్ధాలు చెబుతూ పిచ్చిపట్టి తిరుగుతున్న వ్యక్తి, కళ్లులేని కబోది లోకేష్ అని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజమెత్తారు. యువగళం పాదయాత్రలో భాగంగా లోకేష్ గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిధిలో గుంతలు తప్ప రోడ్లు కనిపించలేదని ఆరోపించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లు పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ నిధులతో పూర్తిచేసిన రహదారులను ఆయన గురువారం పత్రిక, మీడియా ప్రతినిధులకు చూపించారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో వేసిన సీసీ రోడ్లు, తారు రోడ్లను చూపించారు. అనంతరం చిత్తూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేష్ అబద్ధాల పుట్ట అని ధ్వజమెత్తారు. ఏళ్ల తరబడి అటవీ అనుమతులు లేక ఆగిపోయిన రహదారులను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇప్పించి రోడ్లను అభివృద్ధి చేయించారన్నారు. అదే రోడ్లపై పాదయాత్ర చేసిన లోకేష్ సైకోలాగే ప్రవర్తిస్తున్నాడని, రోడ్లను చూసి కళ్ల లేని వ్యక్తిగా మాట్లాడడమే ఇందుకు నిదర్శనమన్నారు. లోకేష్ పాదయాత్రతో టీడీపీకి పడే ఓట్లు కూడా పడకుండాపోతాయన్నారు. దళితులను హింసించే కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు మొదలు పెట్టారని మండిపడ్డారు. 2014 ఎన్నికల సమయంలో బాబు డ్వాక్రా, రైతు రుణ మాఫీలు, నిరుద్యోగభృతి, ఇంటికో ఉద్యోగం ఇలా పలు హామీలతో ప్రజలను మోసం చేశారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల తరువాత ఇచ్చిన మాటలను నెరవేరుస్తూ వస్తున్నారన్నారు. పదవులను కట్టబెట్టడంలో సామాజిక న్యాయాన్ని పాటించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమం, సమన్యాయాన్ని చూసి ఓర్వలేని చంద్రబాబు, పచ్చ మీడియా తప్పుడు కూతలు, రాతలతో క్షుద్ర రాజకీయాలు చేయడం అందరూ గమనిస్తున్నారని ఆరోపించారు. జరగబోయే ఎన్నికల్లో పెత్తందారులు (టీడీపీ అండ్‌కో), పేదవాడు(జగన్) మధ్య యుద్ధం జరగబోతుందని.. ఈపోరులో పేదవాడే గెలుస్తాడని ఉప ముఖ్యమంత్రి జోస్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బండి హేమసుందర్ రెడ్డి, బట్టే సుబ్రమణ్యం, పద్మనాభరెడ్డి, ధనుంజయరెడ్డి, నారాయణరెడ్డి, కమలాకర్‌రెడ్డి, బాలాజీ నాయుడు, శివప్రకాష్‌రాజు, యశోదమ్మ, ప్రసాద్ రెడ్డి, రామయ్య, అమ్ములు పాల్గొన్నారు.



ఎగువ కమ్మకండ్రిగ వయా పుల్లూరుకు నూతనంగా నిర్మించిన రోడ్డు వద్ద ధ్వంసం చేసిన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న డెప్యూటీ సీఎం నారాయణ స్వామి

కాణిపాకం చేరుకున్న శారదా పీఠాధిపతులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి గురువారం రాత్రి 10 గంటలకు విశాఖ శారద పీఠాధిపతులు చేరుకున్నారు. ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే లక్ష మోదక లక్ష్మీ గణపతి హవనం నిర్వహించేందుకు విశాఖ శారద పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి కాణిపాకం చేరుకోగా, ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన యాగశాలను పరిశీలించి అతిథి గృహం చేరుకున్నారు. చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, దేవస్థాన ఏఈఓలు విద్యాసాగర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

టీడీపీకి సందీప్‌నాయుడు గుడ్‌బై

చిత్తూరు అర్బన్: తెలుగుదేశం పార్టీని వీడుతున్నట్లు చిత్తూరు నగరానికి చెందిన మహదేవ సందీప్‌నాయుడు ప్రకటించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు గురువారం సామాజిక మాధ్యమాల్లో మెసెజ్‌ను ఉంచారు. రెండు రోజుల కిందట చంద్రగిరిలో నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇక్కడ చిత్తూరు నేతలతో సందీప్‌కు విభేదాలు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీకి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల జిల్లాలో బీసీ నేతలు సిపాయి సుబ్రమణ్యం, షణ్ముగం టీడీపీని వీడడం..తాజాగా చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన సందీప్ రాజీనామా చేయడం ఆ పార్టీ వర్గాల్లో చర్చానీయశంగా మారింది. రాజీనామా ఎందుకు చేస్తున్నారనే విషయమై తెలుసుకునేందుకు ఆయనకు 'సాక్షి ప్రతినిధి' పలుమార్లు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ చేసి ఉంది.

మరణంలోనూ వీడని బంధం

- భార్య మరణవార్త విని భర్త మృతి
- సొంత పొలంలో పక్కపక్కనే అంత్యక్రియలు
- మిన్నంటిన బిడ్డల ఆర్తనాదాలు
- కూటాల వంకలో విషాదఛాయలు



భార్యాభర్తల మృతదేహాలను పక్కపక్కనే సమాధి చేస్తున్న కుటుంబీకులు (ఇన్‌సెట్) రామప్ప, గౌరమ్మ (ఫైల్ ఫొటో)

బైరెడ్డిపల్లి/పలమనేరు: భార్య మరణించిదనే వార్తను విన్న భర్త తీవ్రంగా కలత చెంది గంటల వ్యవధితో మృతిచెందిన సంఘటన బైరెడ్డిపల్లి మండలం కూటాలవంక గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రామప్ప(70), గౌరమ్మ(63) భార్యాభర్తలు. గ్రామ సమీపంలోని పొలం వద్ద కొడుకులతో కలసి నివాసం ఉంటూ సేద్యం చేసుకుని జీవించేవారు. వీరికి ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కష్టపడి వీరందరికీ ఆ తల్లిదండ్రులు పెళ్లిళ్లు చేశారు. అందరూ సంతోషంగా ఉన్న సమయంలో మూడు రోజుల క్రితం గౌరమ్మకు ఛాతీనొప్పి రావడంతో కుమారులు కుప్పం మెడికల్ కళాశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఆమె కన్నుమూశారు. అవ్వ చనిపోయిందని ఇంట్లో ఉన్న తాతకు మనుమడు చెప్పాడు. దీంతో తీవ్రంగా కలత చెందిన రామప్ప నడుచుకుంటూ పొలం సమీపంలోని గుట్టవైపు వెళ్లి రోదిస్తూ ఉండిపోయాడు. తల్లి శవాన్ని ఇంటికి తీసుకొచ్చిన కుమారులు తండ్రి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. పొలానికి కొంతదూరంలో రామప్ప మృతి చెంది పడి ఉండడాన్ని గుర్తించారు. ఈ సంఘటనతో ''అమ్మా.. నాన్నా.. మమ్మల్ని విడిచి ఒకేసారి వెళ్ళిపోయారా'' అంటూ బిడ్డలు విలపించడం అక్కడున్న వారి హృదయాలను కలచి వేసింది. వారి ఇంటి వద్ద బంధువుల ఆర్తనాదాలు,రోదనలు మిన్నంటాయి. గంటల వ్యవధిలో భార్యాభర్త మృతితో కూటాలవంకలో విషాదఛాయలు అలుముకున్నాయి. వారి పొలంలోనే తల్లిదండ్రులకు బిడ్డలు అంత్యక్రియలను నిర్వహించారు.

కౌంటింగ్‌కు పక్కా ఏర్పాట్లు



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి హరి నారాయణన్, పక్కన ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ తెలిపారు. నగరంలోని ఆర్‌వీఎస్‌నగర్‌లో ఉన్న ఎస్వీ సెట్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం- నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు ఎస్వీసెట్ కళాశాలను కౌంటింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నట్లు వెల్లడించారు. కేంద్రంలో రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు, కౌంటింగ్‌కు టేబుళ్ల ఏర్పాటు, కౌంటింగ్ ప్రక్రియకు వచ్చే సిబ్బందికి భోజన సదుపాయం పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, ఏఎస్పీ జగదీశ్, డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీవో రేణుక తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో సిరులు



మాయిశ్చర్ మీటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

గంగవరం: రైతులు సంప్రదాయ వరి సాగును తగ్గించి చిరుధాన్యాలపై దృష్టి సారిస్తే మంచి ఆదాయం పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని తాళ్లపల్లె రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. రికార్డులను, మాయిశ్చర్ మీటర్(విత్తనాల్లో తేమ శాతం కనుక్కునే పరికరం), ఇతర సాగు పరికరాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. రైతులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి సదస్సులో ఆయన మాట్లాడుతూ సిఫారసు చేసిన మోతాదులోనే ఎరువులు వినియోగించాలని తెలిపారు. ఆర్‌బీకేలో ఎరువులను రైతు కు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి పంటకు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించాలని తెలిపారు. ఈ–క్రాప్ నమోదు కాని వారికి పంటనష్టం, బీమా తదితర పథకాలు వర్తించవన్నారు. ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించారని, ప్రతి ఆర్‌బీకే పరిధిలో చిరుధాన్యాల సాగు పెంచాలని, రాగులు, సామలు, అరికెలు, కొర్రలు తదితర పంటలు సాగు చేస్తే నీటి ఆదాతో పాటు మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. ఏడీఏ శివకుమార్, ఏవో హేమలత, రైతులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

పుంగనూరు: రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల రికార్డులు, గ్రూప్ గ్రౌండింగ్ ద్వారా పంపిణీ చేసిన వ్యవసాయ పరికరాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని జేడీ మురళీకృష్ణ అన్నారు. గురువారం ఆయన ఏడీ శివకుమార్‌తో కలసి మండలంలోని నెక్కుంది, వడ్డిపల్లె, ఏతూరుతో పాటు పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, లైసెన్సులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఎరువులు విక్రయించాలన్నారు. ఆర్‌బీకేల ద్వారా 50 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తున్న పరికరాల సబ్సిడీ నిధులను వారి ఖాతాల్లోకి జమ చేయాలని ఆదేశించారు. ఏవో రాజేష్, ఏఈవో జయంతి, వీఏఏ శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

సదుం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు కే.వెంకటరమణారెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఈఓ విజయేంద్రబాబు గురువారం ఉత్తర్వులు ఇచ్చినట్టు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎం.వెంకటరమణారెడ్డి తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా పాఠశాలకు గైర్హాజరు కావడం, సకాలంలో సిలబస్ పూర్తి చేయకపోవడం, హిందీలో విద్యార్థులు వెనకబడి ఉండడం, మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం వంటి కారణాలతో ఆయన్ను సస్పెండ్ చేసినట్టు చెప్పారు.

వేటాడుతూ.. జల్లెడ పడుతూ...

ఎర్రచందనం దొంగలపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం మోపుతోంది. కట్టుదిట్టంగా నిఘా పెట్టి కదలికలను పసిగడుతోంది. పకడ్బందీగా కూంబింగ్ నిర్వహిస్తూ ఎక్కడికక్కడ అదుపుకుంటోంది. ఏళ్ల తరబడి తప్పించుకుతిరుగుతున్న మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్లను పక్కా ప్లానింగ్‌తో వేటాడుతోంది. వెతికి వెతికి కనిపెట్టి మరీ అదుపులోకి తీసుకుంటోంది. వీరి నుంచి రాబట్టిన సమాచారంతో అంతర్జాతీయ స్మగ్లర్లకు చెక్ పెట్టేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేస్తోంది.



మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్ శివ



మోస్ట్ వాంటెడ్ బ్రదర్స్ బాషా, జాకీర్ అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ కే చక్రవర్తి (ఫైల్)

- ఎర్రదొంగలపై ఉక్కుపాదం
- వరుసగా మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్ల అరెస్ట్
- ఒక్కొక్కరిపై 45 నుంచి 90 కేసులు
- పకడ్బందీగా టాస్క్‌ఫోర్స్ పోలీసుల కూంబింగ్

నెల	పట్టుబడిన స్మగ్లర్లు
సెప్టెంబర్	91
అక్టోబర్	68
నవంబర్	70
డిసెంబర్	101
జనవరి	72
ఫిబ్రవరి	73
మొత్తం	475

సమాచారం

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాల పరిధిలో విస్తరించిన శేషాచలం అభయారణ్యంలో లభ్యమయ్యే అరుదైన ఎర్రచందనానికి ప్రపంచ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో గ్రామస్థాయి నుంచి దేశ విదేశాల దాకా పలువురు స్మగ్లర్లు అడ్డదారిలో సంపాదనకు అలవాటుపడ్డారు. గుంపులు గుంపులుగా అడవిలోకి చొరబడి ఎర్రచందనం చెట్లను నరికేస్తున్నారు. స్మగ్లర్ల ఆటకట్టించేందుకు టాస్క్‌ఫోర్స్, పోలీసులు, అటవీశాఖ అధికారులు నిరంతరం నిఘా పెడుతున్నారు. మోస్ట్‌వాంటెడ్ స్మగ్లర్లపై ప్రత్యేక దృష్టి సారించారు. వెంటాడి వేటాడి ఒక్కొక్కరినీ అరెస్టు చేస్తున్నారు. అందులో భాగంగా ఏళ్ల తరబడి తప్పించుకు తిరుగుతున్న బడా స్మగ్లర్ మురుగన్ (40)ను గత నెల 2వ తేదీన అరెస్ట్ చేశారు. తమిళనాడులోని తిరువణ్ణామలైకి చెందిన మురుగన్‌పై కళాశాల ప్రిన్సిపల్ మన్నూర్ అలీ గురువారం ఒక ప్రకటనలో... శ్రీకాళహస్తి – రేణిగుంట మార్గం మీదుగా ఎర్రచందనం తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. అలాగే అతడి ప్రధాన అనుచరుడు రేణిగుంటకు చెందిన మేఘవర్ణం కూడా పట్టుబడ్డాడు. మురుగన్‌పై ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 42 కేసులు నమోదయ్యాయి. వీరి ద్వారా అంతర్జాతీయ స్మగ్లర్ల సమాచారం రాబట్టే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

దొంగలకు దొంగలు!

వైఎస్సార్ కడప జిల్లా రాపాడు మండలానికి చెందిన అన్నదమ్ములు షేక్ చెంపతిలాల్‌బాషా(36), షేక్ చెంపతిలాల్ జాకీర్(27) ఎర్రచందన స్మగ్లింగ్‌లో ఆరితేరారు. వీరిపై వివిధ జిల్లాల్లో 89 కేసులు ఉన్నాయి. కూలీలుగా చేరిన ఈ అన్నదమ్ములు స్మగ్లర్లతో పరిచయం పెంచుకుని, ముందు లారీలకు దుంగలు లోడ్ చేసేవారు. తర్వాత సులువుగా డబ్బు సంపాదించాలని ఎర్రచందనం కొట్టేసి సొమ్ము చేసుకోవడంపై దృష్టిపెట్టారు. అడవి నుంచి స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న లారీలను పోలీసుల వేషధారణతో అడ్డుకుని హైజాక్ చేస్తుంటారు. అనంతరం సరుకును బడా స్మగ్లర్లకు విక్రయించి రూ.కోట్లు పోగేసుకున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ బ్యాచ్‌ను సిద్ధం చేసుకుని దొంగలకే దొంగలుగా తయారయ్యారు. ఈ ముఠాను గత నెల 5న టాస్క్‌ఫోర్స్ పోలీసులు పక్కా ప్లాన్‌తో అరెస్ట్ చేశారు.

నిఘా పెట్టి .. ఆట కట్టు

శేషాచల సరిహద్దుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కట్టుదిట్టంగా నిఘా పెట్టారు. ఎర్రచందనం స్మగ్లర్ ఒక్కొక్కరి ఆట కట్టిస్తున్నారు. ఏళ్లతరబడి ఫారెస్ట్ అధికారులను ముప్పతిప్పలు పెట్టిన మోస్ట్ వాంటెడ్ ఎర్రస్మగ్లర్ శివ(42)ను గత నెల 25వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. ఇతడిపై పలు స్టేషన్లలో 42 కేసులు ఉన్నాయి. శివకు అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అలాగే వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలానికి చెందిన శివశంకర్ అలియాస్ శివ సుమారు 60 కేసుల్లో వాంటెడ్ క్రిమినల్. ఎర్రచందనం కేసుల్లో పలుసార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. చిత్తూరు పోలీసులు శ్రీరంగరాజపురం వద్ద రెండు రోజుల క్రితం శివశంకర్‌ను అరెస్టు చేశారు. మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్లపై టాస్క్‌ఫోర్స్, పోలీసులు నిఘా పెట్టి ఒక్కొక్కరిని అరెస్టు చేస్తుండటంతో ఎర్రదొంగలు శేషాచలంలోకి ప్రవేశించేందుకు వెనుకడుగు వేస్తున్నట్టు సమాచారం.

బోయకొండ దేవస్థానానికి వేలం ఆదాయం రూ.1.09 కోట్లు

- గత ఏడాది కంటే రూ.16.96 లక్షల రెట్టింపు
- బోయకొండ దేవస్థానం చైర్మన్ శంకర్‌నారాయణ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ దేవస్థానానికి వివిధ హక్కుల నిర్వహణ వేలం ద్వారా రూ.1.09 కోట్లు ఆదాయం సమకూరినట్టు చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ తెలిపారు. గురువారం ఆలయ పరిపాలన కార్యాలయంలో 8 హక్కుల నిర్వహణకు టీజు కోసం వేలం పాటలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలం పాటలకు 35 మంది హాజరయ్యారు. ఆలయం వద్ద పెద్ద భోగం, చిన్న భోగం సేకరణ హక్కు వేలం ద్వారా రూ.88.10 లక్షలు, కొండ కింద క్యాంటీన్, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్ విక్రయాల హక్కు వేలం ద్వారా రూ.11.99 లక్షలు లభించింది. ఇది గత ఏడాది కంటే రూ.16.96 లక్షలు అదనమని దేవస్థానం చైర్మన్ శంకర్ నారాయణ, ఈఓ చంద్రమౌళి తెలిపారు. వారు మాట్లాడుతూ సరైన ధర ఖరారు కాకపోవడంతో దేవస్థానం, పంచాయతీ టోల్ వసూలు హక్కు, తలనీలాలు సేకరణ, కొబ్బరి చిప్పల సేకరణ, ఆలయం వద్ద పాటలు తీసుకునే హక్కు, కొండ కింద తాత్కాలిక అంగళ్ల నిర్వహణ, పుష్ప ఫల పదార్థాల సేకరణ హక్కు వేలాలను వాయిదా వేసినట్టు వివరించారు. వేలం తదుపరి తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.



'ఆడ'నే కాపాడుదాం!

రొంపిచెర్ల కేజీబీవీ పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆడ పిల్లల సంరక్షణపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని అధికారులు, విద్యార్థినులు ప్రమాణం చేశారు. ఆడ బిడ్డ అని తెలిసి గర్భంలోనే తుంచేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. – రొంపిచెర్ల

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

రామకుప్పం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను ఆంగ్లమాధ్యమంలో ఐదో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్(ఎంపీసీ, బైపీసీ)లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ మన్నూర్ అలీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏ ప్రాంతం వారు అయినా ఈ నెల 24వ తేదీ లోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీబీఆర్‌ఏజీసీఈటీ.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీన ఉంటుందన్నారు. వివరాలకు 97045 50107 నంబరులో సంప్రదించాలని కోరారు.

వన్యప్రాణి వేటగాడు అరెస్టు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న అధికారులు

పలమనేరు: మొగిలిఘాట్‌లో గొని చెరువు వద్ద వన్యప్రాణిని చంపి దాన్ని మాంసాన్ని తీసుకెళుతున్న ఓ వేటగాడిని గురువారం అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. మాంసాన్ని సీజ్ చేసి వన్యప్రాణుల చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎఫ్‌ఆర్వో నయీముల్లా తెలిపారు. మొగిలి గ్రామానికి చెందిన గోవిందయ్య కుమారుడు రాజేష్ సమీపంలోని అడవిలో ఓ ముళ్లపందిని చంపి మాంసాన్ని తీసుకెళుతుండగా అటవీ సిబ్బంది పట్టుకున్నట్టు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్‌ఎస్‌ఓ సుకుమార్, ఎఫ్‌బీవోలు తిరుపతయ్య, శ్రీనివాసులు, ఏబీవో తరుణ్ పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు

సదుం: దల్లావారిపల్లె వద్ద గత నెల 26న జరిగిన రవికుమార్ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు సీఐ మధుసూదనరెడ్డి, ఎస్‌ఐ మారుతి గురువారం తెలిపారు. వారి కథనం మేరకు..మండలంలోని బొమ్మిరెడ్డిగారిపల్లెకు చెందిన శేషాద్రిరెడ్డి తిరుపతిలో నివాసం ఉంటున్నాడు. గత నెల 26న దల్లావారిపల్లె వద్ద ఉన్న తన పంట పొలాల పనుల కోసం వచ్చాడు. ఈ సమయంలో అదే గ్రామానికి చెందిన రవికుమార్‌తో ఓ చెట్టు విషయమై ఘర్షణ జరిగింది. కోపోద్రిక్తుడైన రవికుమార్‌ను కట్టెతో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య హేమలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుని బుధవారం అంగళ్లుక్రాస్ వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుడు హత్యకు ఉపయోగించిన కట్టెను స్వాధీనం చేసుకున్నారు.

పంట పొలాల్లో 'గజ' విధ్వంసం

పెద్దపంజాణి: దాసనపల్లెలో బుధవారం రాత్రి నాలుగు ఏనుగుల గుంపు పంటపొలాలపై దాడి చేశాయి. గుర్రప్పరెడ్డికి చెందిన వరి పంటను నగం తిని మరో సగం తొక్కి నాశనం చేశాయి. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి గుర్రప్పరెడ్డి పంట ధ్వంసమై ఉండడాన్ని చూసి బావురుమన్నాడు. సమాచారం అందుకున్న రాయలపేట, చారాల బీట్ ఆఫీసర్లు రవికుమార్, దొరస్వామి గంగాధరం వీఆర్వో సుబ్రమణ్యం ఆచారి అగ్రామానికి చేరుకున్నారు. ఏనుగుల నష్టపరిచిన పొలాలను పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపించి నష్ట పరిహారం మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు మాట్లాడుతూ ఏనుగుల పంట పొలాలపై దాడికి బీభత్సం సృష్టిస్తున్నాయన్నారు. పెద్దకాప్పల్లి, ముదరెడ్డిపల్లి, పెనుగొలకల, చిప్పిరెడ్డిపల్లి, అకులవారిపల్లి, కొత్తూరుగపల్లె, జిట్టంవారిపల్లి, కోగిలేరు, పాట్నగానిపల్లి, దాసనపల్లె పొలాల్లోకి ఏనుగుల గుంపు వచ్చి పదే పదే చొరబడుతూ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. రోజూ ఏదో గ్రామంలోని విరుచుకుపడుతున్నాయని తెలిపారు. అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు.